# వెడలెను కోదండపాణి..

-కె.కె. రఘునందన

కోదుగాడి అసలు పేరు కోదండం అయినా మేం ముద్దుగా 'కోదు' అనే పిలిచేవాళ్ళం. వాడిని కలిసి ఓ దశాబ్దం గడిచిపోయుంటుంది. అప్పట్లో కోదుగాడు అల్లరి చిల్లరిగా అల్లాటప్పాగాళ్ళతో తిరుగుతుంటే వాళ్ళ నాన్నేమో 'ఈ గాడిద కొడుకెక్కడ చచ్చాడంటూ కొండ లంట కోనలంట కాళ్ళరిగేలా తిరగడం మాకెరికే..!!

ఆ తర్వాత్తర్వాత డిగ్రీ డింకీలు కొట్టించాడు.. కాని అవతలివాళ్ళని మాటల్తో బురిడీ కొట్టించటం వెన్నతో పెట్టిన విద్య వాడికి.. ఆ పోలిక తన మేనమావఁ దగ్గ ర్నుంచి పుణికి పుచ్చుకున్నాడు.

ఇదివరలో కోదుగాడి గురించి వాకబు చేస్తే 'వాడి కేం రా బాగా ఎదిగిపోయాడు' అనే వారు తప్ప ఇద మిత్థంగా ఈ నౌకరీ అని గాని, ఈ వ్యాపకం అనిగాని ఎవరూ అనకుండా గుట్టుగానే ఉండిపోయింది.

అయితే ఆ గుట్టు ఇప్పుడు చప్పుడవుతుందన్న సూచనగా నాకు ఓ ఉత్తరం కోదుగాడి నుంచి అంద డం.

'చాలా కాలం తదుపరి తనీ గడ్డ మీద అడుగుపెతు న్నానని, తన శైలే మారిపోయిందని, ఒకప్పుడు కోతి చేష్టలు చేసే కోదుగాడిప్పుడు పూర్తిగా చచ్చిపోయాడని, ఇప్పుడు తనో ఆదర్శవాదిగా, మార్గదర్శిగా ప్రత్యక్షం కాబోతున్నానని, కోదండపాణి స్వామీజీగా అవతరించా నని, రిసీవ్ చేసుకోవడానికి మంది మార్బలంతో రైలు దగ్గరకి రావలసిందిగా వ్రాసాడు.

నేనీ ఉత్తరం విషయం ప్రస్తావించానో లేదో శ్రీమతి బిందు అగ్గిమీద గుగ్గిలానికి సాక్ష్యం పలికింది.

"పోట్లగిత్తల్లే ప్రతివారితో తగవు పెట్టుకునే మీ కోదుగాడు సాదు పుంగవుడయ్యాడంటే నన్నమ్మాలా.. పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగితే ఎవరు పోల్చరు గనుక.. వంద శవాలను ఏకబిగిన భోం చేసిన రాబందు జపం చేయబోతుందంటే నమ్మరు పైగా నడుం విరగ్గొడతారు.. - వెటకారం పాళ్ళెక్కువే ఆమె మాటల్లో.

"వంద చెప్పు వెయ్యి చెప్పు.. కోదుగాడిప్పుడు మారే వుంటాడు.. చిన్నప్పుడెలా వుండేవాడో మనకన వసరం. ప్రస్తుతం వాడో స్వామీజీ అంతే.. వాడిని తోడ్కొని రావటానికి కారు బెత్తాయించాలి.. జనం చూడాలి.." అన్న నా మాటలను ఖండిస్తూ...

"మనం డబ్బు పులిసిపోయిలేం.. ఇంకా నయం బాజా భజంత్రీలతో స్వాగతాలు పలుకుతాననలేదు. మీకంత తప్పదనుకుంటే.. పొరుగింటి పొన్నాంబళం గారి మీద వాలండి... ఆయనకు స్వాములంటే పరమ పిచ్చి.." అని చూచాయగా అన్నది బిందు.

పొన్నాంబళం గారి ఆస్తికత్వానికి ప్రత్యక్ష సాక్ష్యంగా ఇంటినిండా అడ్డమైన బాబాల ఫోటోలు.. స్వామీజీల క్యాలెండర్లూను..

ఇదివరలో వారినీ వీరినీ ఇళ్ళకు రప్పించుకుని మరీ పాదపూజలు జరిపి వేలకు వేలు సమర్పించటం.. ఈయన గారి అమిత దాతృత్వానికి కాళ్ళల్లో కర్రలా వాళ్ళావిడ తయారవటం ఎరగనిది కాదు.

అయితే ఆమెను మించిన మొండి ఘటం పొన్నాం బళం. ఆయన ఇల్లు దూరని స్వామీజీ లేడంటే నమ్మా ల్సిందే..

మరి కోదుగాడి రాకను గనుక పొన్నాంబళం చెవుల్లో వేస్తే తప్పక హారతులు పడతాడు.

నా ఆయుధం ప్రయోగించాను.

కొత్త స్వామి పేరు వింటూనే కళ్ళల్లో భక్తిపాళ్ళు కుమ్మరించేస్కుని - "ఏమిటీ.. స్వామీజీనా! వస్తు న్నారా... ఇంతకీ ఆయనది ఏ తత్వం.." అని ప్రశ్నల వర్షం కురిపించటంలో దిట్టనని రుజువు చేశారు.

వాడి వైఖరి ఏదో నాకు తెలిసేడిస్తేగదా... ఈయన గారికి విశదీకరించటానికి. కాని చిలవలు పలవలుగా, కల్లబొల్లి కబుర్లు అల్లేసి ఉద్బోధిస్తూ ఉబ్బదీశాను.

నా మాటలకు మంత్రముగ్ధుడైన పొన్నాంబళం నాగస్వరం ఊదినోడికి లోకువయిన పాములాగయి నారు..

ఆ మెతకతనమే నాకు శ్రీరామరక్ష... వెంట వెం టనే కారు బెత్తాయించటంతో పాటు చుట్టు ప్రక్కలం దరినీ పోగేసుకుని వచ్చారు..

ఇంతకీ రైలు దిగిన కోదుగాడిని ఎలా పోల్చు కోవాలో అర్థం కాలేదు. పిచ్చిమొక్కల్లా పెరిగిన గడ్డాల్తో దిగుతున్న అయ్యప్ప, భవానీ దీక్షలో ఉన్న వారి నుండి వేరుచేసి చూడ్డానికి కళ్ళు చిట్లించాల్సి వచ్చింది.

చిట్టచివరగా బారెడు గడ్డంతో కాషాయంబర

ధారి.. చేతిలో ఓ దండం దాని చివర తెల్ల జెండాతో దిగినవాడు కోదుగాడిలాగే అనిపించి- 'ఒరే' అనబోయి - "స్వామీ తమరు..." అని పలకరించాను.

"నేను కోదండపాణి స్వామీజీని.." అన్న వాడు బవిరి గడ్డం.. కమిలిన మొహం.. శిగ..తో ఉన్నాడు.

పొన్నాంబళంగారు, రాములయ్య...చక్రనాథ్, తీర్థంకర్ ప్రభృతులంతా సాష్టాంగపడ్డారు.

"దీర్ఘాయుష్మాన్ భవ... అష్టయిశ్వర్య ప్రాప్తిరస్తు.." వంటి ఆశీర్వచనాలతో పాటు వారి శిరస్సును తాకి ఓ సంస్కృత శ్లోకం పఠించటం చేశాడు.

వాడు ముందర దారితీస్తుంటే మేమంతా వెనక బడ్డాం.. ఇంటి దగ్గర కారుదిగేసరికల్లా శ్రీమతి సిద్ధంగా ఉంటుందన్న నా ఊహ తలక్రిందులైంది. ఆ సరికే తలుపులు బిడాయించేసింది. దబదబ బాదాను. తలుపు తీస్తూనే చిందులేసింది. పర్సులో ఐదొందలు కనిపించలేదని, అవి తీసుకెళ్ళి కారు అద్దెకు ధారపోసా రాంటూ గయ్యిమన్నది.

"ఉష్!... మన వాదులాట వింటే పరువు పోతుంది" అని గడ్డం పుచ్చుకు బ్రతిమాలి హారతి పట్టించి బయటకు తోశాను.

అప్పటికే పొన్నాంబళం గారు కాళ్ళు కడుగుతుంటే తను చెంబుతో నీళ్ళు వంపుతున్నాడు తీర్థంకర్.

విసురుగా వచ్చి హారతి పట్టిన బిందును చూస్తూనే- "దీర్ఘ సుమంగళీ భవ" అని ఆశీర్వదించారు కోదండపాణి స్వామీజీ. ఛర్రుమంటూ వెనుదిరిగింది బిందు. వెనకాలే నేనూను..

"మీకు మిత్రుడైతే అవవచ్చుగాక.. కానీ అతగాడి చూపులు నా ఒంటిమీద తేళ్ళు జెర్రులుగా పాకాయి.." అని జుగుప్సగా మొహం పెట్టింది బిందు.

ఉస్సురంటూ బయటకు వెళ్ళాను.

"స్వామీజీ.. తమరికి ఈ పూట విందుగా భక్ష్యములు.." తనదైన సాంప్రదాయ భాషలో అడిగారు.. చక్రనాథ్..

"భక్ష్యములా..?! ఉహుఁ! నాకు కావలసింది గుప్పెడు వేరుశెనగ పలుకులు. అది నా ఆహారం. గోరువెచ్చని పాలు... అది నా పానీయం అన్నాడు కోదండపాణి.

ఆ జవాబు విని దిమ్మెరపోయారంతా...

అంతా సెలవు తీసుకుని వెళ్ళిపోయాక మిత్రుడిని తోడ్కొని మేడ మీద గదిలోకి వెళ్ళాను...

నా ఉపచారాలు చూసి బిందు మండిపడుతున్నది. "ఇప్పటికే మీకు, పిల్లలకు చాకిరీలు చెయ్యలేక ఛస్తున్నాను. ఈ కొత్త స్వామిని నా నెత్తికెక్కించారు.. ఎవరైనా వంటలక్కని కుదర్చండి."

కోదండం డైట్ చార్టు చెప్పాను.

"నలుగురిలో మెహర్బానీకి అలా చెప్పాడే తప్ప నవకాయ పిండి వంటల వాసనలు ఘుమ్మని తగులుంటే నాలుక పీకదూ!!" అంది ఎద్దేవా చేస్తూ..

అయితే బిందు దురూహను సవాలు చేస్తున్నట్లుగా వారం రోజులయినా వాడి భక్ష్య ప్రమాణంలో విపరీత పరిణామాలు చోటు చేసుకోలేదు..

"మా కోదుగాడంటే ఏమిటనుకున్నావ్!" మీసం మెలేసి మరీ అనేసాను.

అయితే నాకూ ఈ చిదంబర రహస్యం అవగత మవక నేరుగా వాడినే అడిగాను.

"బ్రహ్మం బాబా సాహచర్యంలో అచ్చిన విద్య ఇదొక్కటే.. నేనెక్కడ తనకి పోటీ అయి తన ప్రభ ఎక్కడ తగ్గిపోతుందేమోనని కుళ్ళు కొద్దీ నన్ను ఆశ్రమం నుండి వెళ్ళగొట్టాడు. నా ప్రత్యేకత నేను చూపాలని ఇలా వచ్చేసా.." అని చెబుతూనే మరో అభ్యర్థన వెలిబుచ్చాడు.

వాడికి మేమంతా కలిసి ఆశ్రమం నిర్మించి ప్రచారం చేయాలట.. బాంబు పడ్డట్టయింది.

ఇప్పటికే వాడిని నెత్తిమీదకు ఎక్కించుకున్నానని రుసరుసలాడుతూంది బిందు... మరోవైపు పొన్నాంబళం భార్య తన భర్త ఎక్కడ ఈ మత్తులో ఇరుక్కుపోతాడోనని చిర్రెత్తిపోతోంది.

మరి ఇటువంటి తుపాను వాతావరణంలో ఈ బరువెలా ఎత్తుకోవాలో నన్ను అయోమయంలో కొట్టుకులాడాను.

అయినప్పటికీ ఉండబట్టక నాలుక జారాను..

"ఏమిటేమిటి.. అబద్ధాల పెళ్ళికి.. అదేదో వాద్యమన్నట్టు... ఇతగాడో స్వామీజీ.. ఆశ్రమ నిర్మాణమూనా.. వావ్వ.. నవ్విపోతారెవరైనా వింటే... మీలాటి వాళ్ళని ముగ్గులోకి దించి తను పబ్బం గడుపుకోటానికి ఎత్తుకు పై ఎత్తుల వేస్తున్నాడు చూస్కోండి.. కారాలు మిరియాలు నూరటం తనకూ వచ్చని నిరూపించింది బిందు.

ఇక రాకాసిలాటి పొన్నాంబళం గారి భార్య రాజులమ్మను చూసి ఝడిసిపోయి, ఆయనతో కూడా ఈ ప్రసక్తి తేలేదు.

అయితే ఓ రోజు సాయంత్రం విచిత్ర పరిస్థితి

ఎదురైంది..

నేను స్కూలు నుండి వచ్చేసరికి కోదుగాడు అదృశ్యమైనాడు.. బుర్ర పిచ్చెత్తిపోయింది..

"బిందూ... బిందూ... మావాడ్ని ఎలాగయినా ఇక్కడ్నించి తరిమి కొట్టాలని నువ్వు, రాజులమ్మతో కలిసి గూడుపుఠాణి చేసావు కదూ..." అని ఎడా పెడా ఏకేసాను.

"విషయం తెలుసుకోకుండా మాట్లాడకండి.. మీ స్వామి ఇక్కడికి వేంచేసారో, నాకేం తెలుసు.. నేను పల్లెత్తు మాటనలేదు మహాప్రభో!.." ఒట్లు మీద ఒట్లు పెట్టింది.

మరి వీడి జాడ లేదేమిటి చెప్మా!.. కొంపదీసి, ఏ నుయ్యో, గొయ్యో చూసుకుని ఆత్మాహుతికి పాల్పడినా పీకల మీదకి తేలేదు కదానుకుని గుండె గుభిల్లుమని పొన్నాంబళం గారిని శరణుజొచ్చాను.

ఆయనలో ఎక్కడలేని ఆదుర్దా చుట్టుముట్టేసింది. పదండంటే పదండని తన పటాలమంతటినీ కదలదీసారు.

నూతులూ, గోతులూ వెదుకుతూ పోతుంటే సరిగ్గా రామలచ్చన్న పాలెం దగ్గర రోడ్డు వార మర్రిచెట్టు క్రింద జనం గుమిగూడి వుండటం చూసి ఆగాం..

మరెవరు వాడే..!! చేతిలో తులసి పూసలు తిప్పుతూ కూర్చున్నాడు.. వాడి భంగిమ చూసి నడకాపి పరికించని ప్రజలేదంటే శుద్ధ అబద్ధమే!

"ఆహా! ఏం కళ... ఏం వర్చస్సు.." అని చక్రనాథ్ తన్మయులై పొగడ్డమే తన పనిగా పెట్టుకున్నారు.

అతనికి తొత్తులైనారు తీర్థంకర్, రాములయ్య, పొన్నాంబళం. ఇహనేం వీడి పంట పండినట్లే...!!

"స్వామీ.. కళ్ళు తెరచి మమ్మల్ని చూడండి.." అక్కడున్న మరో పెద్దాయన వేడుకోలు..

"సర్వే జనా సుఖినో భవంతు.." అంటూ కళ్ళు తెరిచారు స్వామి.

అందరిలో ఉత్కంఠ.

సరిగ్గా అదే సమయంలో జీపులో వెళ్తున్న రామలచ్చన్నపాలెం సర్పంచ్ శరభన్నాయుడు ఈ అట్టహాసమంతా చూసి దిగాడు..

"ఇంతకీ ఈ సామి.. ఎవరి తాలూకా..." అని గద్దించి అడిగాడు. పొన్నాంబళంగారు నన్ను ముడుకుతో పొడిచి- "మీ మిత్రుడని చెప్పవయ్యా! మీ వాడికి దన్నిచ్చినట్లవుతుంది. పైగా ఆ బరువేదో వాళ్ళే ఎత్తుకుంటారు.." అని సలహా ఇచ్చారు.

అలాగే చేశాను.

"ఉహుం! ఏమాత్రం లాభంలేదు... మీ ఇంట్లో పెట్టుకోకుండా ఊరిమీద వదిలారేం.. మీకు చేతి చమురనా.. ఇలాటి వాళ్ళు బకాసురుడిలా మేసేస్తారు. చూస్కోండి.." అన్నాడు ఎకసెక్కంగా.

"అబ్బే..!! మీకా అపోహ వద్దు.. మావాడు కేవలం గుప్పెడు వేరుశెనగ పలుకులు.. కాసిన్ని పాలచుక్కలు మాత్రమే సేవిస్తాడు.." అన్నాను సర్దిచెబుతూ..

ఆ సమయంలోనే ఎవరో అరిచారు.. "అద్భుతం.. మహాద్భుతం.. స్వామీజీ అరికాళ్ళలో విష్ణుచక్రాలున్నాయి చూడండి ఈ వింత."

అది విన్న శరభన్నాయుడి కాళ్ళు వడివడిగా కదిలి స్వామి దగ్గర ఆగాయి.

తోపులాట మొదలైంది.. కోదండం తన అరిపాదాన్ని చూపిస్తున్నాడు... నేను, పొన్నాంబళం గారు.. అందరం ఆ దొమ్మీలోంచి తోసుకుంటూ చొరబడ్డాం.. అప్పుడే నా ముక్కును ముడుకుతో గుద్దారెవరో.. తీర్థంకర్ కాలు మట్టేస్తే అతగాడేమో కెవ్వున అరిచాడు.

చిట్టచివరికి మా కళ్ళన్నీ అకస్మాత్తుగా అరికాళ్ళల్లో ఉద్భవించిన విష్ణు చక్రంపై పడ్డాయి.

ఇదే మంచి అదునని- "చూసారా! సర్పంచ్‌గారూ! మా వాడి ప్రభావం. దైవాంశంటే యిదేనండీ. ఇలాటి వాడికి మీలాటి పెద్దలే ఆశ్రమం నిర్మించాలి" అని మద్దతు పలికాను.

మా కోదండం గురించి పొన్నాంబళంతో సహా అందరూ ఓవర్ బిల్డప్ ఇవ్వటంతో రామలచ్చన్నపాలెం సర్పంచ్ సంశయిస్తూ గునిసాడు.

ఆశ్రమం నిర్మించటమంటే పెద్ద ప్రణాళిక అని, ఊర్లో వారితో సమాలోచన చేస్తే తప్ప చెప్పలేనని పెదవి విరిచాడు.

అంతే ఆ మాటలు విన్నాడేమో. కోదండం పరుగు పరుగున వెళ్ళి ఎదురుగా నున్న నల్లకొండను అడ్డదిడ్డంగా ఎక్కడం వెనుక ఆంతర్యం ఏ ఒక్కరికీ తెలిసి చావలేదు.

మా గుండెలు తిరగబడ్డాయి. వీడి ప్రాణానికి గాని ఎసరొస్తే ముందుగా బొక్కలోకి తోసేది నన్నే.

కొంత దూరం ఎక్కాక అక్కడే తిష్ఠేసాడు.

"ఆహా! అలనాడు కైలాసగిరి మీద ఆసీనుడయిన ముక్కంటిలా లేదూ స్వామి. పరమ పొంగిపోతూ పొన్నాంబళం గారు ప్రశంసిస్తుంటే మిగతా వాళ్ళు చప్పట్లు చరిచారు.

"మీ పొగడ్తలు మండినట్టే వున్నాయి గాని... స్వామిని కొండ మీంచి దిగమని చెప్పండి బాబూ మీకు పుణ్యం వుంటుంది" అన్నాడు సర్పంచ్.

మేమంతా గావుకేకలు పెట్టి పిలిచాం.

"నేను రాను గాక రాను. నాకంటూ ఆశ్రమం నిర్మించే దాకా నేను దిగేది లేదంటే. నేనేమైనా పర్వాలేదు" తిరిగి అరిచాడు కోదండం.

ఎవరికీ గుండెలు గుండెల్లో లేవు.

ఒకరి మొహాలు ఒకరం చూసుకున్నాం. శరభ న్నాయుడు తమ ఊర్లో ఆశ్రమం నిర్మిస్తామని హామీ ఇచ్చినా కొండ దిగి రాలేదు కోదండం.

ఈ రాత్రికి రాత్రి తనకు ఆశ్రమం నిర్మించిస్తేనే తప్ప తను కొండ దిగేది లేదని భీష్మించుక్కూచున్నాడు.

మడత పేచీలు పెట్టడం వాడికి కొట్టిన పిండి అన్న విషయం నాకు తప్ప మరెవరికి తెలుసు గనుక.

"చెడ్డ చిక్కే వచ్చిందే" అని సర్పంచ్ శరభ న్నాయుడు బుర్ర గోక్కుంటుంటే- అక్కడున్న వాళ్ళంతా "అయ్యా! మరలా మీన మేషాలు లెక్క పెట్టుకు కూచుంటే ఏదయినా అఘాయిత్యం చేసే ప్రమాదం ఉన్నది. కోరి స్వామి మీ ఊర్లో అడుగుపెడతానంటే అంతకంటే అదృష్టం ఏముంటుందండీ" అని ఒత్తిడి చేసారు.

చీకటి పడ్డంతో అందరూ కదిలారు. మేం బెంగ పడుతూనే ఇల్లు చేరాం.

తెల్లవారి వెలుగొచ్చేదాకా కునుకే లేదు. కోదం డాన్ని గాని.. ఎలుగు బంటో, తోడేలో ఈడ్చుకుపోదు గదాన్ని భీతే నెలకొన్నది.

## సిజేరియన్

పిల్లి కడుపులో పులి
పుడుతుందో లేదో...
వానపాము కడుపులో డైనసోర్
తప్పక పుడుతోంది...
పల్లెగర్భాన పోట్లతో
ముక్కలు ముక్కలుగా ప్లాట్లు...
రాజీవ్‌నగర్, ఇందిరా నగర్
శాస్త్రీనగర్, నెహ్రూనగర్...

-గుండాన జోగారావు

మరో వింతయిన విషయం ఏమిటంటే... ఇంత వరకూ కోదండం విషయంలో వైరి వైఖరి ప్రదర్శించిన బిందు... తద్విరుద్ధంగా వాడిని పొగడ్డం ప్రారంభిం చింది.

"ఆహా! అరికాల్లో విష్ణు చక్రం వుందండీ. పైగా నిన్న రాత్రంతా ఈ గడ్డ కట్టుకుపోతున్న చలిలో ఆ కొండ మీదే వుండం ఎంత గొప్ప విషయమండీ. నూటికి నూరుపాళ్ళు దైవాంశ గల వారే" అంది.

"చూసావా! మా కోదుగాడి తడాఖా" అన్నాను పొంగిపోతూ.

"తప్పండీ! ఎంత మిత్రుడైనా మీరలా పిలవద్దు. కోదండపాణి స్వామీజీ... అనే పిలవండి.." సుతిమెత్తగా మందలించి చెప్పింది బిందు.

ఈమెపై ఈ ప్రగాఢ ముద్రకు అసలు సిసలు కారణం పొన్నాంబళం భార్య అని నిర్ధష్టంగా చెప్పటానికి ఒకే ఒక్క సాక్ష్యం ఆమె ఇంట్లోనే కూర్చొని కోదండపాణి స్వామీజీకి జై అంటూ భజనలు చేయటం.

ఏదవనీ గాక ఈ మార్పు నా నెత్తి మీద పాలవాన!

మర్నాడు నేను వెళ్ళేసరికల్లా- రామలచ్చన్న పాలెంలో ఓ చిన్న ఆశ్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మించినట్లుగా నాకనిపించింది.

ఆ ఊర్లో వారంతా కోదండానికి బ్రహ్మరథం పట్టినట్లుగా ధృవపరుస్తూ ఆశ్రమం... అక్కడున్న జనాలూనూ...

మరో రోజు-

"అబ్బ! నీ మిత్రుడు ప్రవచనాలతో అదరగొట్టేస్తు న్నాడోయ్. భగవద్గీత శ్లోకాలు కంఠోపాఠమే! అబ్బ మాటల్లో చెప్పలేను."

చాలామంది నన్ను పొగిడేస్తున్నారు.

కోదండం ప్రవచనాల్లో పస ఏమాత్రముందో పసిగడదామని ఓరోజు వెళ్ళానో లేదో నా కంటే ముందు వరుసలో బిందు, రాజులమ్మ కనిపించారు.

ఫాలోయింగ్ బాగుందే!

కోదండం బరువు బాధ్యతలేవో మెల్లగా నా నెత్తి మీద నుండి గ్రామస్తుల నెత్తి మీదకి మళ్ళటం నిండు ఊపిరినిచ్చింది.

అంతే కాదండోయ్ తర్వాత్తర్వాత పెనుమార్పులు చోటు చేసుకున్నాయి.

'కోదండపాణి స్వామీజీ ఆశ్రమానికి దారి' అన్న బోర్డు రోడ్డువారగా వెలిసింది. ఆశ్రమంలో ఓ డిబ్బీ

విశేషమైన దినాలలో ప్రసాదం పంపిణీ. స్వామి దర్శనార్థం పట్నం బాబుల రాకపోకలు. వగైరాలు. కొత్త అంశాలు.

ప్రవచనాలతో మొదలెట్టి పాదపూజలకెదిగింది కోదండం ప్రభ. గృహ పావనం చేసి పాదపూజ జరిపించుకుంటే ఫలానా ఇంత రేటన్నా వద్దనే వారే కరువైనారు. పైపెచ్చు తేదీలు కూడా ముందే ఖరారు చేసుకుంటున్నారు.

ఎవరైనా వాడిని పట్నం తీసుకెళ్ళాలంటే కారొచ్చి ఆశ్రమం దగ్గర ఆగాల్సిందే!

అంత చనువున్న నాకు వాడితో మాట్లాడ్డానికి కుదిరి చావటం లేదు. అంత బిజీ వాడికి.

రాన్రాను కోదండం ముఖచిత్రమే మారిపోయింది. ఎమ్మెల్యేలు, ఎమ్పీలు కోరి వచ్చి ఆశీర్వచనం పొందుతున్నారు. దీపారాధనలంటూ ముత్తయిదువలందరి చేత ఆ కార్యక్రమం సమర్ధవంతంగా నెట్టుకొచ్చిన ఘనత కోదండందే.

ఇంక మా ఇంటి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. శ్రీమతి బిందు నాలుక మీద కోదండం నామమే నానుతోంది. వీధి వాళ్ళయితే మరీను. ప్రతీ సాయంత్రం భజనలు.

పొన్నాంబళం గారయితే విభూతి రేకలు ఒళ్ళంతా పులుముకుని తెల్లారు ఝామునే పారాయణలు ప్రారంభిస్తున్నారు.

ఇదిలా కొనసాగుతుండగానే వైశాఖ శుద్ధ ఏకాదశి నాడు మరో విశేష కార్యక్రమం ప్రకటించాడు కోదండం. ఎవరైనా సరే తమ ఆభరణాలను సమర్పిస్తే వాటిని స్వామి వారి పూజలో వుంచి జపతపాదులు చేసాక తిరిగి వాటిని ధరిస్తే అష్టయిశ్వర్యాలు సిద్ధిస్తాయని చెప్పాడు.

దీనికి విశేష స్పందన లభించింది.

తమతమ విలువైన ఆభరణాలను కోదండం స్వామీజీకిచ్చి పేరు వ్రాయించుకుని మరీ పూజ జరిపించుకుని, తిరిగి ఎవరి ఆభరణాలను వారు తీసుకుని ధరించేవారు.

ఈ విషయం కాస్తా పట్నానికూడా పాకింది.

అంతే వేలంవెర్రిలా వాళ్ళూ, వీళ్ళు అని లేదు అనేకానేక మంది ఈ కార్యక్రమానికి దన్నిచ్చారు.

ఈసారి పూజలు మూడు రోజుల పాటు సాగుతాయనీ. తనను పూజా సమయంలో ఎవరూ భంగ పరచవద్దని కోరుతూ ఆశ్రమంలోనికి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు కోదండం.

మూడు రోజులయింది. ఇంకా తలుపులు తెరచుకోలేదు. ఇంకా స్వామివారి పూజ పూర్తి కాలేదని చెప్పి పంపేసారు గ్రామస్తులు.

మరో మూడు రోజులు.. ఉహు!

భక్తులంతా ఆశ్రమం దగ్గర మొహరించారు. చూసి చూసి తలుపులు బాదారు. తెరువలేదు. తలుపులు విరక్కొట్టారు.

డిబ్బీ విరక్కొట్టి వున్నది. స్వామిజీ అయిపు లేరు.

డబ్బు, దస్కం... ఆభరణాలు.. అన్నీ హుష్ కాకి.

ఘొల్లుమన్నారంతా... కార్చిచ్చుకంటే త్వరితంగా వార్త వ్యాపించింది. పోలీసులు రంగప్రవేశం చేసారు.

శ్రీమతి బిందు తన చంద్రహారం పోయిందంటూ గోల పెడ్తుంటే నోరు నొక్కేసాను.

కడుపు చింపుకుంటే కాళ్ళ మీద పడే చందమైంది. ఊరంతా అట్టుడికిపోతోంది. పొన్నాంబలం తదితరులు నా మీద ధ్వజమెత్తబోతే వారిని ఊర్కోబెట్టేసరికి నా తలప్రాణం తోకకి వచ్చింది.

మర్నాడు నాలుగు పేపర్లలో వార్తలు గుప్పుమన్నాయి.

'దొంగ స్వామీజీ పరారు'. 'స్వాముల సేవకు వేళాయెరా'. 'పూజల పేరుతో విలువగల ఆభరణాల చోరీ'. రకరకాల శీర్షికలతో వార్తలు.

"అనంతపురంలో ఒట్టుస్వామిగా కర్నూలులో ప్రణవానందమూర్తిగా విశాఖపట్నంలో విష్ణు చక్ర భగవాన్‌గా వివిధ పేర్లతో వేరువేరు రూపాలు ధరిస్తూ చివరికి విజయనగరంలో కోదండపాణి స్వామీజీగా అవతరించి రామ లచ్చన్నపాలెంలో పూజల పేరుతో భక్తుల నుండి లక్షల విలువైన ఆభరణాలు దోచుకున్న ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఇంతేగాక... ఈ నకిలీ స్వామికి అనేక స్వాములతో సంబంధం వున్నట్టుగానూ, అనేక మందిని పెళ్ళి పేరుతో వంచించినట్లుగానూ ఇతగాడికి చారిలామంది రాజకీయ నాయకుల అండదండలున్నట్లుగా కూడా వెలుగులోకి వచ్చింది. ఈ దొంగస్వామి ఆచూకి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు."

ఆ వార్త చదవటంతో నా ప్రాణాలు పైనే పోయాయి. కొంపదీసి కోదుగాడితో నాకు సంబంధం వున్నట్లుగా జనంలో ఎవరైనా పోలీసులు చెవుల్లో ఊదితే... ఇహ నా పని గోవిందా గోవిందా...!?

వెన్నులోంచి ఒకటే జలదరింపు మొదలైంది. ■